# ఇండియన్ పాలిటీ

## రాజ ప్రతినిధులు/ వైస్రాయ్‌లు

### లార్డ్ డఫ్రిన్ (1884 - 88)

లార్డ్ రిప్పన్ అనంతరం లార్డ్ డఫ్రిన్ 1884 - 88 మధ్య రాజప్రతినిధిగా పనిచేశాడు. ఇతడి కాలంలోనే (1885) భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన జరిగింది. 1885 - 86 మధ్య మూడో బర్మా యుద్ధం చేసి దాన్ని పూర్తిగా ఆక్రమించాడు. 1886లో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశాడు. 'భారత జాతీయ కాంగ్రెస్‌ను అల్ప సంఖ్యాకుల సంస్థ (మైక్రోస్కోపిక్ మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్)' అని విమర్శించాడు. కర్మాగార చట్టాన్ని ప్రవేశపెట్టి 9 సంవత్సరాల్లోపు పిల్లలు కర్మాగారాల్లో పనిచేయకూడదని, వయోజన కార్మికులు రోజుకు 11 గంటలు మాత్రమే పనిచేయాలని ఆదేశించాడు.

### లార్డ్ లాన్స్‌డౌన్ (1884 - 93)

భారత్, అఫ్గానిస్థాన్‌ల మధ్య సరిహద్దుగా డ్యూరాండ్ రేఖను నిర్ణయించాడు. సర్ మార్టిమోల్ డ్యూరాండ్ కమిటీ నిర్ణయం మేరకు సరిహద్దులు నిర్ణయించడం వల్ల దాన్ని డ్యూరాండ్ రేఖ అంటున్నారు. మణిపూర్‌లో జరిగిన తిరుగుబాటును అణచివేశాడు. 1891 ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టి కర్మాగారాల్లో రాత్రిపూట స్త్రీలతో పని చేయించరాదని ఆదేశించాడు. ఇతడు 1892లో చేసిన శాసనసభల చట్టం ద్వారానే భారతదేశంలో పరోక్ష ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టారు. శాసన సభ్యులు బడ్జెట్‌పై చర్చ జరపడానికి అనుమతించారు.

### లార్డ్ రెండో ఎల్గిన్ (1893 - 99)

అన్ని ప్రెసిడెన్సీల్లోని సైన్యాలను ఒకే సర్వసైన్యాధ్యక్షుడి అధీనంలోకి తెచ్చాడు. వాయవ్య సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన తిరుగుబాట్లను అణచివేశాడు. ఇతడి కాలంలో తీవ్రమైన కరవుతోపాటు ప్లేగు వ్యాధి కూడా వచ్చింది. సర్‌జేమ్స్ లయల్ అధ్యక్షతన క్షామ నివారణ సంఘాన్ని నియమించాడు (1898).

### లార్డ్ రెండో మింటో (1905 - 10)

రెండో మింటో అటు మితవాదులను, ఇటు అతివాదులను సంతృప్తిపరచడానికి పాలసీ ఆఫ్ కిక్స్ అండ్ కిసెస్ (Policy of Kicks and Kisses)ను అనుసరించాడు. 1906లో సిమ్లాలో ముస్లింలందరూ కలిసి ముస్లింలీగ్ ఏర్పాటు చేసుకునేలా ప్రేరేపించాడు. 1909 మింటో-మార్లే చట్టాన్ని తీసుకువచ్చాడు. ఈ చట్టం ద్వారా భారతదేశంలో ముస్లింలకు మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయించాడు. కాబట్టి రెండో మింటోను 'మత నియోజకవర్గాల పితామహుడు'గా పేర్కొంటారు. శాసన సభల్లో భారతీయ అనధికార సభ్యుల సంఖ్యను పెంచి, భారతీయుల అవకాశాలను తగ్గించాడు. భారతదేశ విభజనకు పునాది వేసిన వైస్రాయ్‌గా రెండో మింటోను పేర్కొంటారు.

### లార్డ్ రెండో హార్డింజ్ (1910 - 16)

రెండో హార్డింజ్ టిబెట్‌పై చైనా దురాక్రమణను అరికట్టి, భారత్, చైనాల మధ్య మెక్‌మోహన్ రేఖను సరిహద్దు రేఖగా నిర్ణయించాడు. వైస్రాయ్ కార్యనిర్వాహక సంఘంలో విద్యాశాఖ సభ్యుడిగా తొలిసారిగా బట్లర్‌ను నియమించాడు. 1911 ఢిల్లీ దర్బార్‌లో బెంగాల్ విభజనను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇతడి కాలంలోనే ఇంగ్లండ్ రాజు 5వ జార్జి సతీసమేతంగా భారతదేశాన్ని సందర్శించాడు. ఢిల్లీ దర్బార్‌లోనే భారతదేశ రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మారుస్తున్నట్లు ప్రకటించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన భారతీయ సైనికుల జ్ఞాపకార్థం ఢిల్లీలో ఇండియాగేట్ (ఆర్చ్)ను నిర్మించారు. విద్యా వ్యాప్తికి రూ.50 లక్షలను కేటాయించాడు. రెండో హార్డింజ్ కాలంలోనే హోమ్‌రూల్ ఉద్యమం ప్రారంభమైంది. ఢిల్లీలో రెండో హార్డింజ్‌పై విప్లవవాదులు బాంబు దాడి చేశారు. దీన్నే ఢిల్లీ కుట్ర కేసుగా పేర్కొంటారు. ఈ కేసులో రాస్ బిహారీ బోస్ తప్పించుకుని జపాన్‌కు పారిపోయాడు. అమర్‌చంద్, ఆనంద్ విహారి, బాల్ ముకుంద్, బసంత్‌కుమార్ బిస్వాస్‌లకు ఉరిశిక్షలను విధించారు.

### లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916 - 21)

1919 భారత ప్రభుత్వ చట్టం లేదా మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా కేంద్రంలో ద్విసభా విధానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రాల్లో ద్వంద్వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. లండన్‌లో భారత హై కమిషనర్ పదవిని ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాలనాంశాలను కేంద్ర, రాష్ట్ర జాబితాలుగా విభజించారు. అయితే భారత రాజ్య కార్యదర్శి, అతడి సలహాసంఘం సభ్యుల జీతభత్యాలను ఆంగ్ల ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. 1919, ఏప్రిల్ 6న రౌలత్ చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1919, ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ దురంతం జరిగింది. 1920లో సహాయ నిరాకరణ ఉద్యమం, ఖిలాఫత్ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. మూడో అఫ్గాన్ యుద్ధం జరిపి అఫ్గానిస్థాన్‌ను పూర్తిగా ఆంగ్ల సామ్రాజ్యంలో విలీనం చేశారు.

## లార్డ్ రీడింగ్ (1921 - 26)

1922, ఫిబ్రవరి 5న చౌరీచౌరా సంఘటన కారణంగా గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను లార్డ్ రీడింగ్ చెరసాలలో నిర్బంధించాడు. 1922లో రీడింగ్ స్వదేశీ సంస్థానాధీశుల మండలిని ఏర్పాటు చేశాడు. ఈ మండలిని 'భారతీయ దుస్తుల్లో ఉన్న ఆంగ్ల అధికారులు'గా గాంధీ పేర్కొన్నారు. రీడింగ్ కాలంలోనే 1922లో I.C.S. పరీక్షలు ఇంగ్లండ్, ఇండియాలలో ఒకేసారి నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. 1923లో స్వరాజ్య పార్టీ ఏర్పడింది.

## లార్డ్ ఇర్విన్ (1926 - 31)

1927లో సైమన్ కమిషన్‌ను లండన్‌లో నియమించారు. 1928లో కమిషన్ భారతదేశాన్ని రెండుసార్లు సందర్శించింది. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్ (1930)లో జరిగింది. గాంధీ అంతకంటే ముందే 1930లో ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. 1931 మార్చి 5న గాంధీ – ఇర్విన్ ఒడంబడిక జరిగింది. ఈ ఒప్పందం ప్రకారమే గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. లార్డ్ ఇర్విన్ కాలంలోనే ఆర్థిక అంశాల పరిశీలనకు విశ్వేశ్వరయ్య కమిషన్ స్వదేశీ సంస్థలపై బట్లర్ కమిటీని నియమించారు. ఇంకా కార్మిక సమస్యలపై విట్లీ కమిటీ, సైనిక సమస్యలపై స్కీన్ కమిటీలను నియమించారు.

## లార్డ్ వెల్లింగ్‌టన్ (1931 - 36)

రెండో రౌండ్ టేబుల్ సమావేశం (1931), మూడో రౌండ్ టేబుల్ సమావేశం (1952) ఇతడి కాలంలోనే జరిగాయి. ఉప్పు సత్యాగ్రహం చేస్తున్న గాంధీని పుణేలోని ఎరవాడ జైలులో నిర్బంధించారు. 1932లోనే గాంధీ – అంబేద్కర్‌ల మధ్య పుణే ఒప్పందం (1952) జరిగింది. 1932లోనే భారతదేశంలో కుల ప్రాతిపదికన నియోజకవర్గాలను కేటాయించారు. దీన్నే కమ్యూనల్ అవార్డు అంటారు. అప్పటి ఇంగ్లండ్ ప్రధానమంత్రి రామ్సే మెక్ డొనాల్డ్ ఈ కమ్యూనల్ అవార్డును ప్రకటించాడు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వం, రాష్ట్రాల్లో స్వయం పాలన ఏర్పాటు చేశారు. ఇండియా కౌన్సిల్ రద్దు, అఖిల భారత సమాఖ్య, కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితా, రాష్ట్రాల్లో ద్విసభా విధానం, స్త్రీలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు లాంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించారు. లార్డ్ వెల్లింగ్‌టన్ కాలంలోనే విశాఖపట్నం నౌకాశ్రయం, మెట్టూర్ డ్యామ్, సింధూ నదిపై సుక్కూర్ ఆనకట్ట నిర్మాణాలను ప్రారంభించారు.

## లార్డ్ లిన్‌లిత్‌గో (1936 - 43)

ఇతడి కాలంలోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. 1942లో క్రిప్స్ రాయబారం విఫలమైంది. గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. భారతీయులకు లిన్‌లిత్‌గో 'ఆగస్ట్ ఆఫర్' ప్రకటించాడు.

## లార్డ్ మౌంట్‌బాటన్ (1947 - 48)

1947, మార్చి 24 నుంచి 1948, జూన్ 21 వరకు పనిచేసిన చిట్టచివరి ఆంగ్ల రాజ ప్రతినిధి/ వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్. 1947, జూన్ 3న భారత విభజన ప్రణాళికను రూపొందించాడు. దీన్నే జూన్ 3 ప్రణాళిక అంటారు. స్వతంత్ర భారతదేశ తొలి ఆంగ్ల గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1947, జూన్ 30న సరిహద్దు సంఘాన్ని నియమించాడు. దాన్నే సిరిల్ రాడ్‌క్లిఫ్ సంఘంగా పేర్కొంటారు. (భారత్, పాకిస్థాన్‌ల మధ్య సరిహద్దు రేఖ రాడ్‌క్లిఫ్ రేఖ.) ఇతడి తర్వాత స్వతంత్ర భారతదేశ తొలి భారతీయ గవర్నర్ జనరల్‌గా రాజగోపాలాచారి నియమితులయ్యారు.

## లార్డ్ కర్జన్ (1898 - 1905)

రైతు బాంధవుడు. 'డూ క్విక్ వైస్రాయ్'గా పేరుపొందాడు. భారతదేశం మొత్తాన్ని బ్రిటిష్ పాలన కిందికి తేవడమే లక్ష్యంగా పనిచేశాడు. వాయవ్య సరిహద్దు రాష్ట్రాన్ని ఏర్పాటు చేశాడు. కల్నల్ యంగ్ హజ్బెండ్ నాయకత్వంలో సైన్యాన్ని పంపించి, టిబెట్ పాలకుడు దలైలామాతో 1904లో లాసా సంధి చేసుకున్నాడు. పర్షియా సింధు శాఖను సైతం బ్రిటిష్ వారి అధీనంలోకి తెచ్చాడు. లార్డ్ రోస్‌బరీ కర్జన్ టిబెట్ విధానాన్ని వివేకరహితమైన విట్టన్ అఫ్గాన్ విధానంతో పోల్చాడు.

కర్జన్ పరిపాలనా కాలాన్ని కమిషన్ల కాలంగా పేర్కొంటారు. ప్రతి రంగంపైనా కమిషన్‌ను నియమించి, వాటి నివేదికల ఆధారంగా సంస్కరణలను ప్రవేశపెట్టాడు. క్షామ నివారణ సూచనల కోసం 1901లో సర్ ఆంథోనీ మెక్ డొనాల్డ్ క్షామ నివారణ సంఘాన్ని నియమించాడు. రైల్వేల్లో సంస్కరణలకు రాబర్ట్‌సన్ కమిషన్, పోలీస్ సంస్కరణలకు ఫ్రేజర్ కమిషన్‌ను నియమించాడు. 1900లో పంజాబ్ భూమి అన్యాక్రాంత చట్టాన్ని (పంజాబ్ భూమి విడుదల చట్టం) ప్రవేశపెట్టి రుణగ్రస్తులైన రైతుల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాడు. బిహార్‌లోని పూసా వద్ద 1903లో 'ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్' అనే పరిశోధన సంస్థను స్థాపించాడు. వ్యవసాయరంగ అభివృద్ధి చర్యల్లో భాగంగా వ్యవసాయ శాఖాధిపతిని (Inspector General of Agriculture) నియమించాడు. ఇలాంటి వ్యవసాయ సంస్కరణల వల్లనే కర్జన్ 'రైతు బాంధవుడు'గా పేరొందాడు. 1902లో సర్ జాన్ మార్షల్ అధ్యక్షతన 'భారత పురావస్తు శాఖ'ను ఏర్పాటు చేశాడు. వాణిజ్య రంగ అభివృద్ధికి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ'ని ఏర్పాటు చేశాడు. కానీ స్వదేశీ రాజుల విదేశీ వాణిజ్యాన్ని మాత్రం పూర్తిగా నిషేధించాడు. 1904లో ప్రాచీన శిథిలాల రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాడు. భారతదేశంలో సీఐడీ వ్యవస్థకు పునాదులు వేశాడు. కర్జన్ అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను కూడా అమలు చేశాడు. ముఖ్యంగా 1904లో కలకత్తా విశ్వవిద్యాలయాల చట్టాన్ని ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయాల్లో భారతీయుల ఆధిపత్యాన్ని తగ్గించాడు. గోపాలకృష్ణ గోఖలే ఈ చట్టాన్ని తీవ్రంగా విమర్శించాడు. 1900లో కలకత్తా కార్పొరేషన్ చట్టాన్ని ప్రవేశపెట్టి ఎన్నుకునే సభ్యుల సంఖ్యను తగ్గించాడు. 1905లో బెంగాల్ విభజన చేసి వందేమాతర ఉద్యమానికి కారకుడయ్యాడు. కర్జన్ 'విభజించి – పాలించు' సిద్ధాంతం ఆధారంగా హిందూ – ముస్లింలను వేరుచేయడానికి తద్వారా భారత జాతీయోద్యమాన్ని నీరుకార్చడానికి బెంగాల్ విభజన చేశాడు. కర్జన్ 1903లోనే బెంగాల్ విభజన చేస్తున్నట్లు ప్రకటించాడు. అయితే 1905, జులై 19న విభజన ప్రకటన చేశాడు. 1905, అక్టోబరు 15న బెంగాల్ విభజన అధికారికంగా అమల్లోకి వచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ అక్టోబరు 16ను జాతీయ సంతాప దినంగా ప్రకటించి, వందేమాతర ఉద్యమాన్ని ప్రారంభించింది.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net